# యింకా... ఏం కావాలి?

మల్లీశ్వరి

**ఇక యిపుడు...**

**స్వేచ్ఛ నాకు లాలసత కాదు... ఒక అనివార్యత**

**స్వేచ్ఛ నాకు కాంక్ష కాదు. ఒక అవసరం.**

* * *

"నీకు పిచ్చి పట్టింది" వంటి బిగువున అన్నాడు శ్రీధర్. అతని కళ్ళలో జ్వాలై ఎగసిన ఆగ్రహం.

అతనివంకే చూస్తుండిపోయాను.

"నీ మాటల్లో ఏవయినా యింగితం వుందా?" ఆవేశం లోంచి ఆవేదనలోకి మళ్ళుతూ అన్నాడు.

నిజమే. సుడిగుండంలా నా చుట్టూ నేనే తిరుగుతూ మహోద్వేగంతో నాలోకి నేనే ఒదిగిపోతూ పాతాళానికి జారిపోవడమే తప్ప అలై ఎగసిపడాలన్న యింగితం వుంటే కదా.

"నువ్వేం ఆలోచిస్తున్నావో అర్థం కావడం లేదు" నిస్పృహగా కుర్చీలో కూలబడుతూ అన్నాడు. అప్పటికి కాస్త కదలిక నాలో.

"ఏం ఆలోచించాలో ఎలా ఆలోచించాలో అర్థం కావడం లేదు. కానీ ఒకటి స్పష్టంగా తెలుస్తోంది. నా జీవితం మాత్రం నీ గుప్పెట్లోనే వుంది. కాస్త వదులు చేయి. ఒసారి పరామర్శించుకుంటాను" మళ్ళీ అడిగాను.

అతను తన గుప్పెటవంక విభ్రమగా చూసుకుంటూ "నేనేం తక్కువ చేశాను నీకు? నిన్నేవన్నా హింసిస్తున్నానా?" అన్నాడు.

"డాడీ! మీ మిస్టేకేం లేదు. అమ్మ మాటలు మీనింగ్‌లెస్" రాకేష్ కల్పించుకుని కోపంగా అన్నాడు. ఇరవై రెండేళ్ళుగా ప్రతిరోజూ నా సేవలు పొందుతూ మరీ యిచ్చిన స్టేట్‌మెంట్. పెద్దగా బాధనిపించ లేదు. అతను తండ్రికి నిలువెత్తు ప్రతిబింబంగా మారాక ఒకరు యిద్దరవడమే తప్ప పెద్ద మార్పేమీ లేదు. బాధ ఎప్పటిదే... పాతదే... వాడు తన హృదయంతో సేవలు పొందడం మానేసి చాలా రోజులయింది.

"రజనీ! నువ్వీ మధ్య దిగులుగా వుంటున్నావు. విసుగ్గా చిరాగ్గా వుందంటున్నావు. ఒసారి ఆలోచించి చూడు. నీ జీవితానికేం తక్కువ నేను నిన్ను ప్రేమించే భర్తని. మనకి చక్కని కొడుకు. నీకు కాలక్షేపానికి వుద్యోగం వుంది. మనది లోటులేని సంసారం. ఆడదానికి యింతకన్నా ఏం కావాలి?" అనునయంగా ప్రశ్నించాడు శ్రీధర్.

**కథ**

సమాధానాన్ని లౌక్యంగా యిముడ్చుకున్న ఈ ప్రశ్నంటే నాకెంత విసుగో! అటు తిప్పి యిటు తిప్పి యివే మాటలు కొన్ని వందలసార్లు కొలీగ్స్, చుట్టాలు, స్నేహితులు, యిరుగు పొరుగు అన్నారు. యింతమంది యిన్నిసార్లు చెప్పినా 'నాకింకేం అక్కర్లేదు' అని అన్పించడం లేదేంటి? ఒక ఆడదానికి యింతకన్నా ఏం అక్కర్లేదని అందరూ నిర్ధారించిన స్థితిలోనూ దిగులు, భయం, ఆందోళన వణికించేస్తున్నాయిగా! అసలే 'అక్కర్లేని స్థితి' ఎలా వుంటుంది? సంతోషమా? సంతృప్తా? ఏవీ శాశ్వతాలు కావుగా.

శ్రీధర్ మంచి భర్తే. వువ్విళ్ళూరించే లక్ష్యాలేవీ మిగలక భార్యప్రేమ లక్ష్యంగా కంటికి ఆనక ముప్ఫయి అయిదో పదినుంచీ సిరినీ, కీర్తినీ వలచి మోహ ప్రపంచంలో పడి గిరగిరా తిరుగుతున్నాడు.

రాకేష్ చక్కని బిడ్డే. వుగ్గుపాలతో కెరీరిజాన్ని జీర్ణించుకుని కమ్యూనికేషన్ స్కిల్స్‌ని కొత్త అర్థాలు నేర్చుకుంటూ లేత పిచ్చుకలా తన గూడును తను పదిలంగా అల్లుకుంటున్నాడు. ఇక నేను యిపుడిపుడే అంకురిస్తున్న కొత్తటి శూన్యాన్ని యిల్లు, కుటుంబం, వుద్యోగం భర్తీ చేయలేకపోవడానికి బిక్కమొహంతో చూస్తూ పాత నమ్మకాల అసంబద్ధత నిలదీస్తుంటే వులికులికి పడుతున్నాను.

ఎవరి ప్రపంచాలు వారివై అవసరార్థం కలుసుకునే మా ముగ్గురి



నాల్గో ప్రపంచమే కదా ఈ కుటుంబం! అసలు నాకో ప్రపంచమంటూ వుందా? వాళ్ళిద్దరూ తమ తమ ప్రపంచాలతో తృప్తి పడక స్వార్థంతో నా ప్రపంచాన్నీ ఆక్రమించి నా నుంచి నన్ను వెళ్ళగొట్టేశారు. ఎంతటి దురాక్రమణ యిది!

ఇలాంటి జీవితంలోని మరీ అంత హఠాత్తుగా కాదు గానీ నలభై అయిదేళ్ళ వయస్సు, మెనోపాజ్ లక్షణాలు పెనవేసుకుని జంటగా ప్రవేశించాయి. గుండెల్ని గుబులెత్తిస్తూ నల్లగా శూన్యం పేరుకుంటోంది. అనాసక్తి కబళిస్తోంది. ఆందోళన స్థిమిపడనివ్వకుండా తరుముతోంది. శరీరం నుంచి వేగంగా పారిపోయిన యవ్వనం వెక్కిరిస్తోంది. అన్నేళ్ళ నుంచీ శరీర ధర్మాల్లో భాగమయినది పోతూ పోతూ ఝంఝూమారుతంలా నన్ను కుదిపేస్తోంది.

ఈ శూన్యంలోంచి బతుకుపట్ల ఆశని పొదువుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. నన్ను చుట్టుముట్టిన సమస్త దైన్యాల నుంచీ నిలబడటానికి సర్వశక్తులూ వుపయోగించాలనుకుంటున్నాను. తీరా చూస్తే నా చేతుల్లో 'ఏమీలేనితనం' కొండంత. అవమానంతో తలవంచినపుడు కన్పించాయి అపుడెపుడో నాకు తెలిసీ తెలియక నేను నేల రాల్చుకున్న నా శక్తుల జాడలు. ఏరుకోడానికి వీలు లేదు. వాటి నిండా తొక్కివేయబడిన గుర్తులు.

"మిగతా ఆడవాళ్ళని చూడు, వాళ్ళు కుటుంబంలో ఎన్ని కష్టాలు పడుతున్నా చిరునవ్వు బెదరకుండా ఎంత హుషారుగా వుంటారో" నిష్ఠూరంగా అన్నాడు శ్రీధర్.

"ఎవరు మిగతా ఆడవాళ్ళు?..."

"ఎవరంటే?... ఎక్కడివరకో ఎందుకు? నీ చుట్టుపక్కల వున్న వాళ్ళనే చూడు..."

చూశాను. మా అక్క, నా స్నేహితురాలు, మా యింటి పనుల్లో సాయంచేసే ఆమె, నా కొలీగ్, రోజూ కూరగాయలమ్మే ఆమె, పక్కింటి సరళ కన్పించారు. యింతకన్నా భిన్నంగా వుండరుగా ఆడవాళ్ళు.

సాయంచేసే ఆమె, నా కొలీగ్, రోజూ కూరగాయలమ్మే ఆమె, పక్కింటి సరళ కన్పించారు. యింతకన్నా భిన్నంగా వుండరుగా ఆడవాళ్ళు.

పైకి కన్పించే వారి చిరునవ్వుల వెనక ఎన్నెన్ని త్యాగాలో నాకు తెలీదు కనకనా? ఏ రోజయినా వాళ్ళ అంతరంగాల్లోకి తొంగిచూసిందా ఈ మగ ప్రపంచం? కానీ నేను చూశాను. నాలో నేను లేకపోవడానికి గుర్తు పట్టినపుడల్లా భయం వేసి మిగతా ఆడవాళ్ళలో వాళ్ళు మిగిలున్నారేమోనని చూసేదాన్ని. వూహూ... అందరూ నాలాగే.

"ఒళ్ళంతా భగ్గున మంటలు... వేడి ఆవిర్లు. కాలూ చెయ్యీ ఆడనట్లుగా వుంటుంది ఒకోసారి. యింట్లో ఎవరికీ పట్టదు" అక్క బాధ పడింది.

"ఆటోల్లానూ, బస్సులోనూ, వంతెనల మీదుగానూ వెళ్తున్నపుడు నా లోపలి నుంచి 'దూకెయ్, దూకెయ్' అంటుంటారెవరో. భయంతో బిక్కచచ్చిపోతాను. ఎవరికి చెప్పుకోవాలో తెలీదు" చెప్పలేక చెప్పలేక చెపుతూ ఏడ్చింది స్నేహితురాలు.

ఇంట్లో ఒక్కదాన్నీ వుండాలంటే భయం. గుండె దడదడలాడుతుంది. ఒళ్ళంతా చెమటల్లుపోసి గాభరాగా వుంటుంది. నలుగురిలో కలిస్తే కాస్త బావుంటుంది. ఎవరింటికన్నా వెళ్ళి కాసేపు మాట్లాడదామంటే ఆయనకి తెలిస్తే యిష్టపడరు" చాటుగా మా యింటికి వచ్చిన సరళ అంది.

"పొగులల్లా యింత కట్టపడినా రాత్రి యేయాళకీ నిద్ర రాదు. యేతెల్లారగట్టకో కూస్త మాగన్ను పడతది. మా వోడికి యివ్వేం పట్టవ్ 'నీరసం మొకందానా' అని వొకటే తిడతాడు. యింక పనెగ్గొట్టితే అమ్మగార్లూరుకుంటారా?" మా యింటి పనుల్లో సాయం చేసే ఆమె



**అతను చెపుతున్నవేవీ నాలో అశాంతిని పోగొట్టడం లేదు. నాకేం కావాలో తెలుసుకోడానికి నిరంతరం సంఘర్షిస్తున్నాను. చిన్నప్పటినుంచీ బలవంతంగా రుద్దబడిన భావాలను వదుల్చుకోవడం ఎంత కష్టంగా వుంది! అలాగని వాటిని భరించడం మాత్రం సుఖమా?**

దుఃఖపడింది.

ఇక నా కొలీగ్, కూరగాయలమ్మే ఆమె చెప్పిన బాధలు వర్ణనాతీతం. వీళ్ళంతా వాళ్ళకి అందుబాటులో వున్న పనిముట్లతో హృదయానికి మరమ్మతులు చేసుకుంటున్నారు. డొల్లబారిపోయిన వ్యక్తిత్వాల్లో గడ్డీగాదం నింపుతూ... ఒకరు భక్తినీ మరొకరు నిస్సహాయతనీ, యింకొకరు పరాయి ప్రేమలనూ, కుట్లూ అల్లికలనూ అందరూ టి.వి. సీరియల్స్‌నీ ఆవాహన చేసుకుంటూ పైకి చిరునవ్వులు ప్రకటిస్తున్నారు. కానీ నేనలా వుండదల్చుకోలేదు.

అందుకే వీటన్నింటినీ దాటి నాలోకి నేను బలంగా చొరబడటానికి ప్రయత్నిస్తున్నాను. ఛెళ్ళున చరుస్తోంది ఆలోచనా రాహిత్యపు మందపుగోడ. యింత దృఢంగా ఎవరు నిర్మించారు దీనిని? ఆవలివైపు ఏవుంది? పదే పదే ఢీ కొంటున్నా. బద్దలవ్వాలన్న ఆశతో. నా శరీరం మీద నుంచీ, హృదయంలోంచీ మేధస్సు వైపుగా అడుగులు వేయాలనుకుంటున్నాను.

ఏం చేసుకోవాలో సరిగ్గా తెలియడంలేదు కానీ నా జీవితాన్ని నా దగ్గరే అట్టిపెట్టుకోవాలని వుంది. సార్థకమే చేసుకుంటానో వ్యర్థమే చేస్తానో, నా చేతుల్లోనే జరగాలని వుంది. అందుకే శ్రీధర్‌తో నా సంఘర్షణ అంతా చర్చించాను.

కానీ నేను తనకి అర్థం కావడం లేదు. 'కుటుంబం అన్నాక నీదీ, నాదీ అంటూ వుండదు. అట్లా స్వార్థంగా వుండలేం' అంటూ నాకు మాత్రమే వుద్దేశించబడిన పాత నీతులను చెపుతున్నాడు.

అతను చెపుతున్నవేవీ నాలో అశాంతిని పోగొట్టడం లేదు. నాకేం కావాలో తెలుసుకోడానికి నిరంతరం సంఘర్షిస్తున్నాను. చిన్నప్పటి నుంచీ బలవంతంగా రుద్దబడిన భావాలను వదుల్చుకోవడం ఎంత కష్టంగా వుంది! అలాగని వాటిని భరించడం మాత్రం సుఖమా?

"ఏదేమయినా మనముందున్న జీవితాన్ని చూసి సంతృప్తి చెందకుండా యింతకు మించి ఏదో వుందనుకోవడం భ్రమ రజనీ! పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకోకుండా సంతోషంగా వుండు. వడ్డించిన విస్తరిలాంటిది నీ జీవితం. అసలు యిలాంటి లైఫ్ లీడ్ చెయ్యాలని చాలామంది స్త్రీలు కోరుకుంటారు. అది తెలుసుకో ముందు." యిక మాట్లాడాల్సిన అవసరం ఏమీ లేదన్నట్లు లేచి వెళ్ళిపోయాడు శ్రీధర్. నాకు వెర్రిదుఃఖం ముంచుకొచ్చింది. నేను చాలా గొప్పగా జీవిస్తున్నానంట. నాకు యింతకుమించి ఏమీ అక్కర్లేదంట.

మరి నేనెందుకు సంతోషంగా లేను?

ఈ సంఘర్షణ నాకెందుకు సంతృప్తినివ్వడం లేదు?

అసలింతకీ నాకేం కావాలి?

నాకే కాదు ఎవరికయినా యింకా ఏం కావాలి?

* * *

గోదావరి ఒడ్డు...

వెన్నెల జోరుగా కురుస్తోంది...

నా చుట్టూ స్వచ్ఛమయిన తెల్లని పొడి యిసుక. చిన్ని చిన్న అలల గలగలలతో గోదావరి నాతో గుసగుసలాడుతోంది. నా చుట్టూ ఏడెనిమిది అమాయకత్వాలూ, చైతన్యాలు. అందరూ పది పన్నెండేళ్ళ లోపు పిల్లలే.


గాలి మార్పు కోసం ఓ వారం రోజుల్ని పోరాడి సాధించుకుని అక్కవాళ్ళ వూరు వచ్చాను. 'వెన్నెల్లో గోదారి అందం' చూస్తానంటే ఆ వీధిలో వున్న పిల్లలు హుషారుగా నన్నిక్కడికి తీసుకువచ్చారు.

పిల్లల నవ్వులు, అరుపులు, పరుగులు

425/- లింగవర్ధక యంత్రం
బంపర్ ఆఫర్

దీనిని ఉపయోగించడం వలన మీ అంగమును 2 నుండి 3 అంగుళాలు పొడవు, లావు చేయవచ్చు, పరిశుద్ధమైన స్టాకు మాత్రమే. దీనితోపాటు శీఘ్రస్ఖలనం, నపుంసకత, జడత్వము మొదలైన రోగములకు సంబంధించి 60 రోజులకు సరిపడు మందు ఉచితంగా తెప్పించుకొనగలరు.

ADDRESS : RACHANA AUSHADHALAYA,
POST- KATRI SARAI (GAYA)
PIN - 805105
(M) - 09430557285 / 09801212821




వీళ్ళకేం బాధలు లేవా? జలపాతాల్లా ఈ ఒడ్డున ఎలా తుళ్ళి తుళ్ళి పడుతున్నారు!!

మరి నేనూ? యింతటి సౌందర్యాన్ని చూస్తున్నా నా మనసులో వెల్తి... దిగులు... నా జీవనయానంలో ఆనందాన్నీ, వుల్లాసాన్ని ఎక్కడో పెట్టి మర్చిపోయాను. గుర్తొచ్చి వెతుక్కుంటుంటే దొరకడం లేదు.

యింత విశాలమయిన ప్రపంచంలో నా దిగులు పోగొట్టే చోటే లేదా? పిల్లలు పరుగుపందెం పెట్టుకుని పరుగులు తీస్తూ వచ్చి లక్ష్యంగా పెట్టుకున్న నన్ను ముట్టుకుని కింద పడుతూ గోలగోలగా యిసుకలో దొర్లి ఒకటే నవ్వులు.

పిల్లలు గొప్పదాతలు కదా. తమ ఆనందాన్ని నాకూ పంచాలనుకున్నారేమో "ఆంటీ! మీరూ రండి. పరిగెడదాం" అంటూ పిలిచారు. పెద్దగా పట్టించుకోలేదు. నవ్వి వదిలేసాను.

"ప్లీజ్... రండీ..." పిల్లలు నా చుట్టూ మూగిపోయారు.

"నేనా?... నేను పరుగెత్తడమా?! ఏం బావుంటుంది?" నాలో నేను గొణుక్కుంటుండగా హఠాత్తుగా ఓ కొత్త ఆలోచన మెరిసింది. అవును ప్రశ్నాలోచన. నన్ను నేను నిలదీసుకునేలా.

ఎవరికి బావుండాలి? నా పరుగో, పనో, కోరికో ఎవరికి నచ్చాలి? మందపుగోడ బీటలు వారింది.

"చాలా బావుంటుందండీ... ఈ యిసుకలో పరిగెడితే యింకా బావుంటుంది" ఆ పసికళ్ళ మెరుపు నాలో ఆశని కలిగిస్తోంది.

గోదావరి ఒడ్డున ఈ వెన్నెలరాత్రి పాలమనసుల పిల్లలతో కలిసి పరిగెడుతూ ఆడుకోవడం నాకిష్టమేనా? ప్రశ్నించుకున్నాను. 'అట్లా అడగాలి కూడానా!' అంటూ మనసు కోప్పడింది. నాకీ పని చాలా యిష్టం. నాకిష్టమయిన పనిని నేనెందుకు చేయకూడదు?

నేను తడబడుతూ లేచి నా మనసుకి బిగించి వున్న సంకెళ్ళను విదిలించడం మొదలుపెట్టాను.

తిరుగుబాటు ప్రారంభమయింది. చిత్రంగా ఒక చిన్నారి సమూహం యిస్తున్న గొప్ప ప్రోత్సాహంలో.

కొంగు నడుం చుట్టూ తిప్పి కుచ్చెళ్ళతో కలిపి పట్టుకున్నాను. చెప్పుల్ని పక్కకి వదిలాను. నా పాదాల తాకిడికి యిసుక అణువణువూ రేణువులగా విచ్చిపోతూ తోవ యిచ్చింది. పిల్లలు లయబద్ధంగా చప్పట్లు కొడుతున్నారు.

నేను పరుగు ప్రారంభించాను. నడుం కలుక్కుమంది. పరుగు ఆపలేదు. మోకాళ్ళు జివ్వున లాగుతున్నాయి. పరుగు ఆపలేదు.

గాలిని పీల్చుకుంటూ నా పాదాలతో ఈ భూమిపై బలమయిన ముద్రలు వదులుతూ పరిగెడుతున్నాను. ఎంత బావుంది ఈ పరుగు! వెనక నుంచెవరో తరుముతున్నట్లు లేదు. ముందు వూరిస్తున్న స్వప్నాలను వెంబడిస్తున్నట్లుంది.

నా నుంచి బరువయినవి ఏవో తెగి పడుతున్నకొద్దీ నా శరీరం తేలికగా దూదిపింజెలా మారిపోతోంది.

పరిగెత్తి పరిగెత్తి అలిసి యిసుకలో కూలబడ్డాను ఒకటే ఆయాసం ఒళ్ళంతా చిరుచెమట్లు. గుండె దడదడలాడుతోంది. కానీ ఎంత గొప్ప అనుభవమిది! ప్రకృతి, మనసు, శరీరం మూడూ ఒక్కటై సంగమించిన ఈ క్షణాల్లో నాలో అద్భుతమయిన జీవ లక్షణమేదో ప్రవహిస్తోంది.


స్నానం చేసి కాస్త శ్రద్ధగా తయారయ్యాను. రోజూ వెళ్ళే తోవలో కాకుండా కొత్త తోవలో ఆఫీసుకి వెళ్ళాను. కొత్త పరిసరాలు, మనుషులు, వుత్సాహంగా చూసుకుంటూ నడిచాను.


పైట చెదిరిందా, జడ వూడిందా, శరీరం ఎలా పడితే అలా చలించిందా ఏమో అసలా పట్టింపులే లేవు.

నాకిపుడు అర్థమయింది నేనింతకాలం ఆనందాన్నీ, సంతృప్తినీ దూరం నుంచి చూస్తూ ఆనందించాననుకున్నాను, సంతృప్తి చెందాననుకున్నాను. అపుడవి మరీచికల్లా దాహాన్ని తీర్చలేకపోయాయి. కానీ యిపుడు ఆనందంలోకి, సంతృప్తిలోకి చొచ్చుకుపోయి వాటి సారాన్ని ఎలా పీల్చుకోవాలో తెలిసింది.

మరి నాకూ ఆనందానికి, నాకూ సంతృప్తికి మధ్య దూరాన్ని సృష్టించిందెవరు? నా మనసుకి సంకెళ్ళు వేసిందెవరు? నా పకపక నవ్వుల్ని నా చక చక నడకల్ని నియంత్రించిందెవరు?

ఇక నుంచీ కొత్త చూపుతో నన్ను నిలువెల్లా తడుముకోవాలని తెలిసింది. అంతేకాదు సమాధానాలు సరిగ్గా దొరకాలంటే ఎలాంటి ప్రశ్నలు వేసుకోవాలో అర్థమయింది.

* * *

తెల్లవారింది.

ఎప్పట్లాగే అయిదున్నరకి నిద్ర లేచాను. కానీ ఎప్పట్లాగే వంటగదికి పరుగెత్తలేదు. తాపీగా పళ్ళు తోముకోడానికి సింక్ దగ్గరకి నడిచాను. కుడిచేత్తో కాకుండా ఎడం చేత్తో బ్రష్ చేశాను. మెదడులోని న్యూరాన్లు 'శభాష్' అంటూ వుత్సాహపరిచాయి.

ఉదయపు గాలిలోని తాజాదనాన్ని ఒడిసిపట్టాలనిపించి దాబా మీదకి వెళ్ళాను. అపుడే తూర్పు ఎర్రబడుతోంది. సూర్యోదయాన్ని ప్రత్యక్షంగా చూసి ఎన్నేళ్ళయిందో లెక్కలు కట్టే ప్రయత్నం చేసి తేలక వూరుకున్నాను. ఈలోగా సూర్యుడు తళతళలాడుతూ పైకొచ్చాడు. 'ఈ సూరీడు ఎంత అందగాడు!' అందుకే కాబోలు పద్మాలు మొహాల్లో నవ్వుల్ని వికసింపజేస్తాయి. తదేకంగా చూడసాగాను.

"ఏం చూస్తున్నావ్?" శ్రీధర్ గొంతు వినిపించింది. 'పద్మప్రియుడివి' అందామా అనుకున్నాను. చలం మిత్రుడు గుర్తొచ్చి ఆగిపోయాను.

"టయిమవుతోంది వంట చెయ్యవా? యింతవరకూ కాఫీల్లేవు... రాకేష్ చిరాకు పడుతున్నాడు..." కోపంగా అన్నాడు శ్రీధర్. ఒక్క వుదయాన్ని సొంతం చేసుకోడాన్ని కూడా భరించలేరు.

"కాసేపాగి వస్తాను... ముగ్గురం కలిసి చేస్తే ఎంతలోకవుతుంది వంట" అన్నాను. కొత్త మాటలకి కొత్తగా చూసి వెళ్ళిపోయాడు.

స్నానం చేసి కాస్త శ్రద్ధగా తయారయ్యాను. రోజూ వెళ్ళే తోవలో కాకుండా కొత్త తోవలో ఆఫీసుకి వెళ్ళాను. కొత్త పరిసరాలు, మనుషులు, వుత్సాహంగా చూసుకుంటూ నడిచాను.

దిగులు నా వంక దిగులుగా చూసి వీడ్కోలు చెపుతోంది. వుల్లాసం నేనొస్తానంటూ మారాం చేస్తోంది.

ఆఫీసులో అందరితోనూ మాట్లాడాలనిపిస్తోంది. కష్టసుఖాలు పంచుకోవాలనిపిస్తోంది. పగలంతా ప్రతి అంశంలోనూ జీవితాన్ని పునర్నిర్మిస్తూనే గడిపాను. ఎంతో కష్టంగా వుంది. చాలా ఒత్తిడిగా వుంది. కానీ ఈ ప్రయత్నమంతా ఎంతో తృప్తినిస్తోంది.

సాయంత్రం యింటికి వచ్చేసరికి శ్రీధర్ మిత్రుడు అతని భార్య వున్నారు. వాళ్ళతో చిరునవ్వులు చిందిస్తూ మాట్లాడుతున్నాడు శ్రీధర్. అతని గొప్పతనం నా అదృష్టం వాళ్ళకి అర్థం చేయించేసినట్లున్నాడు నాతో మాట్లాడిన అయిదు నిమిషాలకే మిత్రుని భార్య "రజనీ! యువార్ లక్కీ... యింతకన్నా మీకేం కావాలి?" అంది.

శ్రీధర్ నావంక అర్థవంతంగా చూస్తున్నాడు. నా చిరాకుని అదుపు చేసుకుంటూ నిబ్బరంగా నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

'నీకింకా ఏం కావాలి?' అని

నాకింకా ఏం కావాలా?

పాత వలువల సంకెళ్ళను వూడి పారేయాలి. కుంగిపోయిన రెక్కల్లో సత్తువ నింపుకుంటూ దృఢంగా చాపాలి. శరీరాన్ని అలా అలా సాగదీసి నిటారుగా మునివేళ్ళపై నిలబడాలి. వంచడం అలవాటయిన శిరసుకు ధైర్యంచెప్పి చూపుల్ని అనంతాకాశంలోకి సంధించాలి. కొత్త సత్యాల దారుల్లో పక్షిలా రివ్వు రివ్వున పయనించాలి.

యింకా ఏం కావాలా?

యింకా ఏం కావాలో వెతుక్కునే 'స్వేచ్ఛని' నేను గుర్తించడం కావాలి.